# సూపరో.. సూపరస్య.. సూపరోభ్య:

- 'మూడో సూపర్ ఓవర్'కు తేలిన ఫలితం
- మహారాజా ట్రోఫీలో అరుదైన సన్నివేశం

బెంగళూరు: క్రికెట్‌లో మరీ ముఖ్యంగా పొట్టి ఫార్మాట్‌లో ఇరు జట్ల స్కోర్లు సమం అయినప్పుడు ఫలితాన్ని తేల్చే 'సూపర్ ఓవర్' ఒక్కటి ఉంటేనే అభిమానులకు జబర్దస్త్ మజా ఉంటుందంటే అలాంటివి 3 ఉంటే ఇంకేమైనా ఉందా..! దానిని చూసినోళ్లంతా 'సూపరో.. సూపరస్య.. సూపరోభ్య:' అనాల్సిందే. బెంగళూరు వేదికగా కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) నిర్వహిస్తున్న మహారాజ ట్రోఫీలో భాగంగా హుబ్లీ టైగర్స్, బెంగళూరు బ్లాస్టర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. మనీష్ పాండే సారథ్యంలోని హుబ్లీ 20 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అవగా బెంగళూరు సైతం 20 ఓవర్లకు సరిగ్గా 164 వద్దే ఆగిపోయింది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. తొలి సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు 10/1 స్కోరు చేయగా 11 పరుగుల ఛేదనలో హుబ్లీ కూడా 10/0 చేసింది. రెండో సూపర్ ఓవర్‌లో హుబ్లీ 8 రన్స్ చేస్తే బెంగళూరు 6 బంతుల్లో 8 పరుగులకే చేతులెత్తేసింది. ఇక మూడో సూపర్ ఓవర్‌లో బెంగళూరు 12/1 స్కోరు చేయగా హుబ్లీ(13)తరఫున మన్వంత్





కుమార్ రెండు ఫోర్లు బాదడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

# కాజల్ పసిడి పట్టు

**అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ టోర్నీ**

అమ్మాన్(జోర్డాన్): ప్రతిష్ఠాత్మక అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ల పసిడి పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఇప్పటికే నలుగురు మహిళా రెజ్లర్లు స్వర్ణ పతకంతో మెరువగా, తాజాగా కాజల్ ఈ జాబితాలో చేరింది. శుక్రవారం జరిగిన మహిళల 69కిలోల ఫ్రీస్టయిల్ విభాగం తుది పోరులో కాజల్ 9-2తో అలెగ్జాండ్రా రైబక్(ఉక్రెయిన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన కాజల్..ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మరోవైపు 46కిలోల విభాగంలో శ్రుతిక..యు కత్సుమి(జపాన్) చేతిలో ఓడి



రజతంతో సరిపెట్టుకుంది. 40కిలోల పోరులో రాజ్‌బాల 11-5తో మోనాక ఉమ్మెవా(జపాన్)పై గెలిచి కాంస్యం సొంతం చేసుకుంది. 53కిలోల కాంస్య పతక పోరులో ముస్కాన్..ఇసాబెల్లా గొంజాలెజ్(అమెరికా)పై గెలిచింది. మొత్తంగా ఈ టోర్నీలో భారత మహిళా రెజ్లర్లు ఐదు స్వర్ణాలు సహా ఒక రజతం, మూడు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఇదిలా ఉంటే భారత పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లర్లు నిరాశపరిచారు. ఐదుగురు బరిలోకి దిగినా ఒక్కరు కూడా సెమీస్‌కు అర్హత సాధించలేక చతికిలపడ్డారు. హర్ష్, వివేక్ మాత్రమే తొలి రౌండ్‌లో గెలిచినా రెండో రౌండ్‌లో చేతులెత్తేశారు.



జెమీ స్మిత్ (111)

## కష్టాల్లో లంక

మాంచెస్టర్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న శ్రీలంక తొలి టెస్టులో ఎదురీదుతోంది. ఆతిథ్య జట్టును 358 పరుగులకే ఆలౌట్ చేసిన లంకేయులు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ మూడో రోజు 53 ఓవర్లలో 182/5 పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 122 పరుగుల కీలక ఆధిక్యం దక్కించుకుంది. ఆ జట్టు తరఫున యువ వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ (111) సెంచరీతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో లంక ఒక్క పరుగు వద్దే ఓపెనర్ నిషాన్, కుశాల్ వికెట్లను కోల్పోయింది. 95 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టును సీనియర్ బ్యాటర్ ఏంజెలో మాథ్యూస్ (65), కమిందు మెండిస్ (48 నాటౌట్) ఆదుకున్నారు. అయితే మాథ్యూస్‌ను పాట్స్ ఔట్ చేయడంతో లంక కష్టాలు రెట్టింపయ్యాయి. మూడో రోజు 53 ఓవర్ల ఆట ముగిసేసరికి లంక 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

**1** ఈ మిలీనియంలో సెంచరీ చేసిన తొలి ఇంగ్లండ్ వికెట్‌కీపర్, బ్యాటర్‌గా జెమీ స్మిత్ (24 ఏండ్ల 40 రోజులు) రికార్డుల్లోకెక్కాడు.



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూ శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి భూపిందర్‌సింగ్ హుడాను వినేశ్ మర్యాదపూర్వకంగా కలుసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువతో అనర్హత వేటుకు గురైన వినేశ్‌కు.. స్వదేశంలో ఘన స్వాగతం లభించిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫోగాట్!

## లంక, కివీస్ 6రోజుల టెస్టు

దుబాయ్: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య వచ్చే నెలలో గాలే వేదికగా జరుగబోయే మొదటి టెస్టును ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. సాధారణంగా టెస్టులు అంటే ఐదు రోజులే జరుపుతుండగా గాలే టెస్టుకు మాత్రం రిజర్వ్ డే ను ఏర్పాటు చేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. తొలి టెస్టు సెప్టెంబర్ 18 నుంచి 22 మధ్య జరగాల్సి ఉండగా 21వ తేదీ నాడు విశ్రాంతినిచ్చారు. అదే రోజు శ్రీలంకలో అధ్యక్ష ఎన్నికలున్న నేపథ్యంలో ఆరోజు మ్యాచ్‌ను నిర్వహించడం లేదని ఐసీసీ తెలిపింది. స్వదేశంలో ఆరు రోజుల టెస్టు ఆడనుండటం లంకకు 23 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా ఆ జట్టు 2001లో జింబాబ్వేతో ఆడిన టెస్టును 6 రోజులు ఆడింది.

# నీరజ్ అదుర్స్

**89.49 మీటర్లతో రెండో స్థానం • ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన**

**డైమండ్ లీగ్‌లో మెరిసిన చోప్రా**



లాసానే: భారత బల్లెం వీరుడు, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా మరోసారి సత్తా చాటాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం నెగ్గిన నీరజ్.. అవి ముగిసిన కొద్దిరోజులకే లాసానే (స్విట్జర్లాండ్) వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 89.49 మీటర్లు విసిరి రెండో స్థానంలో నిలిచాడు. నీరజ్‌కు ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. గజ్జల్లో గాయం కారణంగా 'పారిస్'లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక రజతంతో సరిపెట్టుకున్న నీరజ్.. లాసానే లోనూ తడబాటుకు గురయ్యాడు. ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న అతడు మొదటి నాలుగు త్రోలలో బరిసెను 84 మీటర్ల దూరాన్ని దాటించలేకపోయాడు. నాలుగో రౌండ్ ముగిసేసరికి నీరజ్ నాలుగో స్థానంతో ఉన్నాడు. కానీ ఐదో రౌండ్‌లో 85.58 మీటర్ల త్రోతో టాప్-3లోకి వచ్చాడు. ఇక ఆరో రౌండ్‌లో 89.49 మీటర్ల దూరం విసిరి రెండో స్థానానికి ఎగబాకాడు. పారిస్‌లో కాంస్యం గెలిచిన గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 90.61 మీటర్లతో అగ్రస్థానంలో నిలవగా జర్మన్ ఆటగాడు వెబర్ జులియన్ 87.08 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. అయితే వచ్చే నెల 5న జ్యూరిచ్‌లో జరుగనున్న చివరి డైమండ్ లీగ్‌లో టాప్-6లో నిలిచిన వాళ్లు..14న బ్రస్సెల్ వేదికగా జరిగే లీగ్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. 2022లో డైమండ్ లీగ్ టైటిల్ గెలిచిన నీరజ్..గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.గత కొంత కాలంగా సతమతమవుతున్న ఈ స్టార్ అథ్లెట్ సీజన్ ముగిసిన తర్వాత గాయానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నాడు.

# షకీబ్ అల్ హసన్‌పై హత్యాయత్నం కేసు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ఎంపీ, ఆ దేశ క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ అయిన షకీబ్ అల్ హసన్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఢాకాలోని అడబొర్ పోలీస్ స్టేషన్‌లో రఫికుల్ ఇస్లాం అనే వ్యక్తి తన కొడుకు మరణానికి మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు షకీబ్ కూడా ఓ కారణమని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు జరిపిన ఉద్యమంలో రఫికుల్ కుమారుడు రూబెల్ ప్రాణాలు కోల్పోయాడు. అయితే తన కొడుకు మరణానికి హసీనాతో పాటు మరో 158 మంది బాధ్యులను (వీరిలో అధికంగా అవామీ లీగ్ ఎంపీలే ఉన్నారు) చేస్తూ ఇస్లాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు షకీబ్‌ను 27వ నిందితుడిగా చేర్చారు. ఆగస్టు 7న రూబెల్ మరణించగా జూలై 26 నుంచి ఆగస్టు 9 దాకా షకీబ్.. కెనడాలో గ్లోబల్ టీ20 లీగ్ ఆడటం గమనార్హం.

## ఐహిక సంచలనం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ)లో శుక్రవారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో పుణెరీ పల్టాన్ 10-5తో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్‌పై అద్భుత విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో ఐహిక ముఖర్జీ 11-7, 11-5,11-6తో ప్రపంచ నంబర్13 బెర్నెడెట్టెకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. వరుస గేముల్లో ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి పోరులో జావో మంటారియో 1-2తో మానుష్‌పై ఓడగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో మంటారియో, ఐహిక ద్వయం 1-2తో మానుష్, షాక్స్‌పై పరాజయం పాలైంది. చివరి రెండు సింగిల్స్‌లో అంకూర్ 3-0తో లియాన్‌పై, నటాలియా 2-1తో రీత్‌పై గెలిచి పుణెకు బోణీ అందించారు.

# బంగ్లా పోరాటం

**రాణించిన షద్మన్, ముష్ఫీకర్**

రావల్పిండి : పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బంతితో విఫలమైన బంగ్లాదేశ్ బ్యాట్‌తో పోరాడుతోంది. పాకిస్థాన్ చేసిన భారీ స్కోరు (448/6)కు దీటుగా బదులిస్తూ తొలి ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఆ జట్టు ఓపెనర్ షద్మన్ ఇస్లాం(93) తృటిలో శతకాన్ని కోల్పోగా మోమినుల్ హక్ (50) రాణించాడు. ముష్ఫీకర్ రహీమ్ (55 నాటౌట్), లిటన్ దాస్ (52 నాటౌట్) క్రీజులో ఉన్నారు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై పాక్ బ్యాటర్ల మాదిరిగానే బంగ్లా ఆటగాళ్లు నిలకడగా పరుగులు రాబడుతున్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 132 పరుగులు వెనుకబడే ఉంది.



షద్మన్ (93)

## రోహిత్ కోసం 50 కోట్లు!

ముంబై: ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్‌శర్మ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, లక్నోసూపర్ జెయింట్స్ జట్లు 50 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం కాబోతున్నాయి. వచ్చే సీజన్ కోసం జరుగనున్న వేలంపాటలో రోహిత్‌ను దక్కించుకునేందుకు ఢిల్లీ, లక్నో పావులు కదుపుతున్నాయి. అయితే ముంబై జట్టును వీడే విషయంలో రోహిత్ తీసుకునే నిర్ణయం కోసం ఫ్రాంచైజీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఒకవేళ ముంబై నుంచి తప్పుకోవాలని భావిస్తే.. కండ్లు చెదిరే రీతిలో హిట్‌మ్యాన్‌కు రికార్డు ధర పలికే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ సాధించడంలో రోహిత్ కీలకంగా వ్యవహరించాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.